సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 2 । జూలై । 2024



చీనీ టన్ను రూ.20 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం పలికాయి.



వారెవ్వా..మెటా!
మెసేజింగ్ యాప్ వాట్సాప్ మెటా పేరుతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్- ఏఐ టూల్ అందుబాటులోకి తెచ్చింది. సమాచారం క్షణాల్లో ప్రత్యక్షమవుతోంది.
8లో

గరిష్టం/కనిష్టం
34.4°/22.8°
జిల్లావ్యాప్తంగా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి
- డీఆర్‌ఓ కొండయ్య



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందే ప్రతి అర్జీకి తప్పక పరిష్కారం చూపాలని డీఆర్‌ఓ కొండయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఏఓ వసుంధరతో కలిసి కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై 114 అర్జీలు అందగా, వాటి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీన్ని గుర్తించి అధికారులంతా పనిచేయాలన్నారు. సుపరిపాలన, సమర్థత, అవినీతి రహిత సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా వెబ్‌పోర్టల్‌ను ప్రారంభించిందన్నారు. అర్జీలు ఇచ్చే వారు అర్జీపై ఫోన్ నంబర్, ఆధార్ నంబర్ తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు.

రేపు జిల్లా సర్వసభ్య సమావేశం
ఈనెల 3వ తేదీ బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జిల్లా సర్వ సభ్య సమావేశం ఉంటుందని డీఆర్‌ఓ కొండయ్య తెలిపారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' అనంతరం ఆయన అధికారులతో సమీక్షించారు. సర్వసభ్య సమావేశంలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. ఆయా శాఖల అధికారులు పూర్తి వివరాలతో నివేదికలను సిద్ధం చేసి సీపీఓకు అందజేయాలన్నారు. వర్షాకాలంలో తాగునీరు ఎక్కడా కలుషితం కాకుండా చూడాలని, ఎప్పటికప్పుడు వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. డ్రైనేజీలు శుభ్రం చేయాలని, లీకేజీలను అరికట్టాలన్నారు.

టీబీ డ్యాంకు భారీగా వరద



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: కర్ణాటక రాష్ట్రం హొస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శివమొగ్గ జిల్లా పరిధిలోని తుంగా (గాజనూరు) జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ఆ నీరంతా తుంగభద్ర జలాశయానికి చేరుతోంది. గత నెల 28న 879 క్యూసెక్కులు, 29న 1,818 క్యూసెక్కులు, 30న 6,308 కూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సోమవారం ఉదయానికి 11,854 క్యూసెక్కులకు పెరిగింది. ప్రస్తుతం డ్యాంలో 1,633 అడుగులకు నీటి మట్టానికి గాను 1,584.15 అడుగులకు నీరు చేరింది. డ్యాం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 6.782 టీఎంసీల నీరు ఉంది. అవుట్‌ఫ్లో 296 క్యూసెక్కులుగా ఉంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆగస్టు 15 నాటికి జలాశయం పూర్తి స్థాయిలో నిండే అవకాశం ఉందని బోర్డు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో హెచ్చెల్సీ ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వరినార్లు పోసి ఖరీఫ్ పంటల సాగుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

అర్హులందరికీ పింఛన్లు
- మంత్రి సత్యకుమార్



వేల్చుమడుగులో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి సత్యకుమార్

బత్తలపల్లి: అర్హులందరికీ పింఛన్లు అందిస్తామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. సోమవారం ఆయన టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌తో కలిసి మండలంలోని వేల్చుమడుగు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా కింద అందజేసే సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో 2,72,000 మందికి, ధర్మవరం నియోజకవర్గంలో 48వేల మందికిపైబడి వివిధ రకాల పింఛన్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేనప్పటికీ ఇచ్చిన మాట మేరకు పెంచిన పింఛన్ 1వ తేదీనే అందజేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు, డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాల నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తామన్నారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ, పింఛన్ల పంపిణీతోనే సంక్షేమ, అభివృద్ధి పాలన మొదలైందన్నారు. అంతకుముందు ఇంటింటికి వెళ్లి పింఛన్‌దారులకు పింఛన్ మొత్తం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోటి సూర్యప్రకాష్‌బాబు, కోళ్లమొర్రం చంద్రశేఖరరెడ్డి, ఆకులేటి వీరనారప్ప, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కరెంటు బిల్లు.. జనం ఘొల్లు!



✓ పుట్టపర్తి ఉజ్వల ఫౌండేషన్‌లో ఓ నివాసం ముందు ప్రకటన బోర్డు ఉంచారు. అయితే ఆ ఇంట్లో ఎలాంటి వ్యాపారం నిర్వహించడం లేదు. బోర్డును చూసిన విద్యుత్ అధికారులు.. ఇంట్లో ఉన్నవారితో సంప్రదించకుండా సదరు ఇంటి మీటర్‌ను కమర్షియల్ కింద చూపి బిల్లు వేశారు. దీనిపై వినియోగదారుడు విద్యుత్ కార్యాలయంలో సంప్రదించగా.. ఇంటి వద్దకు వచ్చి పరిశీలించి.. సమస్య పరిష్కరిస్తామన్నారు. ఇంతవరకూ ఎలాంటి చర్యలు లేవు.

✓ గోవిందపేటలోని ఓ ఇంట్లో వివాహ వేడుక సందర్భంగా ఒక నెలలో అధిక కరెంటు వినియోగం జరిగింది. మరుసటి నెలలో విద్యుత్ అధికారులు వచ్చి లోడ్ పెంచుకోవాలని సూచించారు. అంతేకాకుండా రూ.8 వేలు జరిమానా కూడా విధించారు. మొత్తం చెల్లించి.. మీటరు మార్చుకోవాలని హుకుం జారీ చేశారు. ఇల్లు పరిశీలించాలని.. వినియోగదారులు డిమాండ్ చేయడంతో.. ఆ తర్వాత సమస్య సద్దుమణిగింది. కానీ జరిమానా కట్టాల్సిందేనంటూ రూ.4 వేలు మోపారు.

✓ ప్రశాంతి నిలయం వెస్ట్ గేట్ ప్రాంతంలోని ఓ ఇంటి విద్యుత్ మీటరు పాడైపోయింది. నెల బిల్లు రూ.900 ఇచ్చారు. మరుసటి నెలలో కొత్త మీటరు అమర్చారు. తర్వాత నెల ఏకంగా రూ.2,600 బిల్లు ఇచ్చారు. ఇదేంటని ఆరా తీయగా... సగటు రీడింగు ప్రకారం బిల్లు ఆటోమేటిక్‌గా వస్తుందని సమాధానం ఇచ్చారు. ఏ లెక్కన సగటున తీసుకున్నా.. అంత బిల్లు ఎలా వస్తుందని వినియోగదారుడు ప్రశ్నించినా ఫలితం లేదు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇస్తే.. అధికారులతో మాట్లాడి తగ్గించే ప్రయత్నం చేస్తామని చెప్పారు.

- అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం
- ఎడాపెడా సగటు రీడింగ్ బిల్లుల మోత
- ఇల్లు ఏదైనా.. రెండు కిలోవాట్‌ల మీటర్లు
- పుట్టపర్తిలో వెలుగులోకి వరుస ఘటనలు
- అధికారులను సంప్రదించినా ఫలితం శూన్యం



ఓ ఇంటికి బిగించిన విద్యుత్ మీటర్ (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి విద్యుత్ శాఖ అధికారులు అత్యుత్సాహం వల్ల సామాన్యులపై మోయలేని భారం పడుతోంది. సమస్య ఏదయినా.. తప్పు ఎవరిదైనా.. వినియోగదారులనే బలిచేస్తున్నారు. అవసరం లేకున్నా మీటర్ లోడ్ పెంచుకోవాలంటూ అధిక మొత్తం వసూలు చేస్తున్నారు. ఏ కారణంతో మీటర్ పాడైపోయినా.. కొత్త మీటరు బిగించి డబ్బులు లాగుతున్నారు. మీటరు మార్చిన వెంటనే ఏడాదిలో సగటున రీడింగ్ తీసుకుని రెండు నెలల బిల్లు భారం మోపుతున్నారు. ప్రతి నెలా సగటున రూ.వెయ్యి బిల్లు వచ్చినా.. మీటరు మార్చిన మరుసటి నెలలో ఏకంగా రూ.3 వేలు దాటుతోంది. ఇలాంటి పరిస్థితులు శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో తరచూ వెలుగు చూస్తున్నాయి.

కొంతకాలంగా ఇదే తంతు
పుట్టపర్తిలో ఒక గది ఉండే ఇల్లు చాలా ఉన్నాయి. అయినా విద్యుత్ శాఖ అధికారులు లోడ్ పెరిగిందంటూ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నేరుగా జరిమానా విధిస్తున్నారు. జరిమానా చెల్లించడం ఆలస్యమైతే.. మరింత భారం పడుతుందని హెచ్చరిస్తున్నారు. వినియోగదారులు గట్టిగా నిలదీస్తే కదిరికి వెళ్లి డీడీ గారిని కలవాలని చెబుతున్నారు. అక్కడికి వెళ్లి వచ్చే ఖర్చులు భరించలేని చాలా మంది మీటరు మార్చుకుంటున్నారు. ఫలితంగా ప్రతి నెలా అధిక భారంతో సతమతమవుతున్నారు. మరోవైపు ఇంటి ముందు వైపు ఎలాంటి ప్రకటనలు కనిపించినా.. వెంటనే కమర్షియల్‌లోకి మార్చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి బయట ఉండే కరెంటు స్తంభాలకు అంటించే ప్రకటనలతో ఇంటి యజమానికి ఎలాంటి సంబంధం లేకున్నా.. విద్యుత్ అధికారులు సదరు ఇంటి మీటర్‌ను కమర్షియల్ కింద చూపుతూ లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారు.



పుట్టపర్తిలోని విద్యుత్ ఏఈ కార్యాలయం

మా దృష్టికి తెస్తే.. పరిష్కరిస్తాం

"వినియోగదారులకు ఎలాంటి సమస్యలు వచ్చినా.. వెంటనే కార్యాలయంలో సంప్రదిస్తే.. పరిష్కార మార్గం చూపిస్తాం. సాంకేతిక లోపం కారణంగా అక్కడక్కడా పొరపాట్లు జరిగితే సరిచేస్తున్నాం. వినియోగదారులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేస్తే.. బిల్లులు తగ్గించే ప్రయత్నం చేస్తాం. వినియోగం ఆధారంగానే అధిక లోడ్ మీటర్లు బిగించాల్సి వస్తోంది. మీటరు పాడైపోయినా.. ఎలాంటి భయం వద్దు. ఆర్నెళ్ల సగటు తీసుకుని రీడింగు ప్రకారం బిల్లు ఇస్తాం.
– శరవణ, విద్యుత్ ఏడీ, పుట్టపర్తి



నెల రోజులకే రూ.2,574 బిల్లు ఇచ్చిన వైనం

20 మండలాల్లో వర్షం

పుట్టపర్తి అర్బన్: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ జిల్లాలోని 20 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా కదిరి మండలంలో 48.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక నల్లచెరువు 44.2, కొత్తచెరువు 33.6, బుక్కపట్నం 32.4, ఎన్‌పీ కుంట 10.4, గాండ్లపెంట 10.2, నల్లమాడ 9.8, పెనుకొండలో 9.0, ఓడీ చెరువు 8.4, సోమందేపల్లి 8.2, పుట్టపర్తి 7.8, గుడిబండ 4.8, అగళి 4.0, అమడగూరు 2.8, ముదిగుబ్బ, పరిగి, లేపాక్షి మండలాల్లో 2.0, తనకల్లు 1.8, తలుపుల 1.4, హిందూపురం మండలంలో 1.2 మి.మీ వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరో రెండు రోజులూ జిల్లాకు ఓ మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి
- పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్



నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వాసుదేవన్

పుట్టపర్తి: కేంద్ర ప్రభుత్వం జూలై 1వ తేదీ నుంచి నూతన చట్టాలను అమలు చేస్తోందని, వీటిపై అందరికీ అవగాహన కల్పిస్తున్నట్లు పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్ తెలిపారు. సోమవారం బుక్కపట్నం పోలీస్‌స్టేషన్‌లో నూతన చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భారతీయ న్యాయ సంహిత-2023, భారతీయ నాగరిక సురక్ష సంహిత-2023, భారతీయ సాక్ష్య అధినియం -2023 చట్టాల గురించి వివరించారు. ఈ చట్టాల అమలు వల్ల కలిగే ప్రయోజనాలను అందరికీ తెలపాలన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి రూరల్ సీఐ రామయ్య, బుక్కపట్నం ఎస్‌ఐ సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే అతిసారం అరికట్టగలం
- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్



ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్, వైద్యులు

ధర్మవరం అర్బన్: ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా వారు అతిసారం బారిన పడకుండా కాపాడగలమని, ఇందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో 'డయేరియాను ఆపండి' అనే కార్యక్రమంపై ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన డాక్టర్ సెల్వియా సాల్మన్ మాట్లాడుతూ...ఐదేళ్లలోపు పిల్లలకు, వారి తల్లులకు ఓఆర్‌ఎస్ అందించాలని, ఇంటింటా సర్వే చేసి అతిసారంతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు పంపిణీ అందివ్వాలన్నారు. ఆరోగ్య పరిస్థితిని బట్టి అవసరమైన వారిని సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలన్నారు. గ్రామాల్లోని అన్ని పాఠశాలల్లో పిల్లలకు హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గ్రామంలోనూ వాటర్ టెస్టింగ్ చేయాలని, పైపుల లీకేజీలను గుర్తించి వాటిని పంచాయతీ కార్యదర్శి ద్వారా మరమ్మతు చేయించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఓఆర్‌ఎస్ కార్నర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవీలత, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు నమ్మకం కలిగించాలి

- అర్జీదారులకు తక్షణ న్యాయం జరిగేలా చూడాలి
- సిబ్బందికి ఎస్పీ మాధవరెడ్డి ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీమాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: తమ 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో అందే ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించి, బాధితులకు పోలీసు వ్యవస్థపై నమ్మకం కలిగించాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి 26 అర్జీలు అందాయి. ఎస్పీ స్వయంగా అర్జీదారులతో మాట్లాడి సమస్య విన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అర్జీలన్నీ నిర్ణీత సమయంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసులను ఆదేశించారు. అలాగే దివ్యాంగులు, వృద్ధులు మహిళల ఫిర్యాదులకు మెదటి ప్రాధాన్యం ఇస్తూ త్వరగా విచారణ జరిపి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆడిషనల్ ఎస్పీ విష్ణు, దిశ డీఎస్పీ శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

లోన్ తీసుకోకపోయినా వేధిస్తున్నారు
ధర్మవరానికి చెందిన నేసే భారతికి కొద్ది రోజుల ఓ ఫోన్ కాల్ వచ్చింది. మీకు లోన్ కావాలా... అన్నది సారాంశం. తనకు అవసరం లేదని భారతి ఫోన్ కట్ చేసింది. కొద్దిరోజుల తర్వాత ఓ వ్యక్తి ఫోన్ చేసి తమ వద్ద తీసుకున్న లోన్ చెల్లించాలని డిమాండ్ చేశాడు. తాను ఎవరి వద్ద లోన్ తీసుకోలేదని చెప్పినా అతను వినిపించుకోలేదు. ఆ తర్వాత కొందరు ఇంటి వద్ద వచ్చి లోన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో ఆమె సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. లోన్ యాప్ బారి నుంచి కాపాడాలని కోరారు. తనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, ఆదుకోకపోతే ఆత్మహత్యే శరణ్యమని కన్నీరుమున్నీరైంది.

ఆరు నెలలు తిప్పి చేతులెత్తేశారు
చిలమత్తూరు మండలం కొడికొండ గ్రామానికి చెందిన విజయమ్మ ఇంట్లో ఆరు నెలల క్రితం చోరీ జరిగింది. మొత్తంగా రూ.3.50 లక్షల చోరీ చేశారు. దీంతో బాధితురాలు అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ ఇంట్లో పనిచేసే మహిళపై అనుమానం వ్యక్తం చేశారు. అయినా పోలీసులు సదరు పనిమనిషిని స్టేషన్‌కు పిలిపించలేదు. ఆరునెలల తర్వాత ఆధారాలు లేవని చేతులెత్తేశారు. దీంతో బాధితురాలు విజయమ్మ సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్పీ మాధవరెడ్డి వెంటనే డీఎస్పీకి ఫోన్ చేసి కేసు వివరాలు వెల్లడించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ



ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

సోహైల్ (ఫైల్)

- డ్రైవర్ మృతి

తనకల్లు: రహదారి పక్కనే ఉన్న ఇంట్లోకి లారీ దూసుకెళ్లిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు చెందిన సోహైల్ (23) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున కదిరి వైపు నుంచి బి.కొత్తకోటకు లారీని డ్రైవ్ చేస్తూ బయలుదేరిన సోహైల్... తనకల్లు మండలం పరాకువాండ్లపల్లికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని రోడ్డు పక్కనే ఇంట్లోకి దూసుకెళ్లాడు. ఘటనలో ఇంటి ముందు గది పూర్తిగా ధ్వంసమైంది. శిథిలాల కింద చిక్కుకున్న సోహైల్‌ను స్థానికులు కాపాడి వెంటనే కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. కాగా, లారీ దూసుకెళ్లడంతో సలీం అనే వ్యక్తికి చెందిన ఇంటి గది పూర్తిగా ధ్వంసమైంది. ఇంటి ముందు గదిలో ఓ హోటల్‌ను ఆయన నిర్వహిస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున హోటల్‌లో పనిచేసుకుంటున్న సలీం.. ప్రమాదాన్ని గుర్తించగానే త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. ఆయన భార్య నూర్జహాన్ ఇంటి లోపలి గదిలో నిద్రిస్తుండడంతో ప్రాణాలతో బయటపడింది. ఘటనతో దాదాపు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు సలీం వాపోయాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తనకల్లు ఎస్‌ఐ ధరణిబాబు తెలిపారు.

నిరీక్షిస్తేనే పింఛన్!

- పేరుకు 'ఇంటింటికీ' అంటూ ఆర్భాటం
- అందరికీ ఒకే చోట పంపిణీ చేసిన సచివాలయ సిబ్బంది
- దివ్యాంగులు, వృద్ధులకు తప్పని అగచాట్లు



హిందూపురం 32వ వార్డులో గుడికట్టపై పింఛన్‌కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు



30 వార్డు న్యూహస్నాబాద్ పంపిణీ కేంద్రంలో పింఛన్‌కోసం పడిగాపులు

హిందూపురం: పింఛన్ మొత్తం కోసం వృద్ధులు, దివ్యాంగులు పడరాని పాట్లు పడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక జూలై నెలకు సంబంధించి సోమవారం మొదటిసారి పింఛన్ పంపిణీ చేసింది. వలంటీర్లను పక్కనపెట్టి సచివాలయ సిబ్బందితోనే ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందేలా చూస్తామంటూ ప్రకటించినా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా కనిపించింది. చాలా ప్రాంతాల్లో అందరూ ఒకచోటకు వస్తే పింఛన్ ఇస్తామని చెప్పడంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతూ అక్కడకు చేరుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో సర్వర్ పనిచేయకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు వృద్ధులు అంతసేపు ఉండలేక ఇళ్లకు వెళ్లి మళ్లీ మధ్యాహ్నం తర్వాత ఆటోలు మాట్లాడుకుని వచ్చారు. దీంతో పింఛన్ల కోసం గత ఐదేళ్లకు ముందు పడిన కష్టాలు వృద్ధులకు మళ్లీ కళ్ల ముందు కనిపించాయి. పెరిగిన పింఛన్ చేతికందుతుందన్న ఆశతో వచ్చిన వారంతా నిరీక్షించలేక నీరసపడ్డారు.

88 శాతం పింఛన్ పంపిణీ



మడకశిరలో పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ పార్థసారథి

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ తొలిరోజు సోమవారం 88 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, మంత్రులు సవితమ్మ, సత్యకుమార్ యాదవ్, ఎంపీ పార్థసారథి ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేలు వివిధ గ్రామాల్లో పర్యటించి పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేశారు. కొన్ని ప్రాంతాలకు ప్రజాప్రతినిధులు వెళ్లగానే పింఛన్ దారులందరినీ సచివాలయాల వద్దకే పిలిపించి పింఛన్ అందజేశారు.

క్లుప్తంగా

పాము కాటుతో యువకుడి మృతి


సుబ్బయ్య (ఫైల్)

పుట్లూరు: మండలంలోని కడవకల్లుకు చెందిన సుబ్బయ్య (28) పాము కాటుతో మృతి చెందాడు. ఆదివారం రాత్రి బహిర్భూమికి గ్రామ సమీపంలోని అరటి తోట వద్దకు వెళ్లిన సమయంలో విష సర్పం కాటు వేసింది. విషయాన్ని వెంటనే కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

యువకుడి దుర్మరణం

పుట్టపర్తి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి గోతిలో పడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కపట్నం మండలం గూనిపల్లికి చెందిన సురేష్ (30) ఆదివారం వ్యక్తిగత పనిపై రాశింపల్లికి బయలుదేరాడు. ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ఆయన గ్రామ శివారులోకి చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించబోయి అదుపు తప్పి పక్కనున్న గోతిలోకి దూసుకెళ్లాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన సురేష్‌ను కుటుంబసభ్యులు అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక సోమవారం ఉదయం ఆయన మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.

డయేరియాతో ఒకరి మృతి

కణేకల్లు: మండలంలోని అంబాపురం గ్రామానికి చెందిన బోయ వండ్రప్ప (71) డయేరియాతో మృతి చెందాడు. రెండ్రోజులుగా తీవ్ర విరేచనాలతో బాధపడుతున్న ఆయన బళ్లారిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీంతో అప్రమత్తమైన యర్రగుంట పీహెచ్‌సీ వైద్యాధికారులు సోమవారం అంబాపురంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ విజయకుమార్‌నాయక్, ఎంపీహెచ్ఈఓ తిరుపాల్‌నాయక్‌తోపాటు ఎంఎల్‌హెచ్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి డయేరియా, జ్వరాలపై ఆరా తీశారు. అలాగే మలేరియా వ్యతిరేక మాసోత్సవంపై రాయదుర్గం డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్, యర్రగుంట పీహెచ్‌సీ డాక్టర్, సిబ్బందితో కలసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైరల్ ఫీవర్స్, డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు.

గొర్రెకు 'సిజేరియన్'


గొర్రెకు సిజేరియన్ శస్త్ర చికిత్స చేస్తున్న శింగనమల వెటర్నరీ సహాయ సంచాలకుడు డాక్టర్ పద్మనాభం

శింగనమల: శింగనమలలో కాపరి బాలకృష్ణకు చెందిన ఓ గొర్రెకు సోమవారం సిజేరియన్ శస్త్ర చికిత్స చేసి, గొర్రె పిల్లను బయటకు తీశారు శింగనమల వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్.పద్మనాభం . గొర్రె ఈనలేక ఇబ్బంది పడుతుండడంతో గత నెల 28న శింగనమల పశువైద్యశాలకు తీసుకువచ్చారు. గొర్రెను పరీక్షించిన డాక్టర్.. కడుపులోనే పిల్ల చనిపోయి ఉంటుందని గొర్రెకు సిజేరియన్ శస్త్ర చికిత్స చేయాలని సూచించారు. మందులు ద్వారా ప్రయత్నించాలని గొర్రెల కాపరి కోరడంతో, మందులు పెట్టారు. ఫలితం లేకపోవడంతో సోమవారం సిజేరియన్ శస్త్ర చికిత్స చేసి, గొర్రె పిల్లను బయటకు తీశారు. గొర్రెకు కుట్లు వేసి రైతు వెంట ఇంటికి పంపారు. శస్త్ర చికిత్సలో వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

వారెవ్వా.. మెటా!

- వాట్సాప్‌లో కొత్త ఫీచర్
- ఏ సమాచారం కావాలన్నా క్షణాల్లోనే
- మెటా ఏఐతో ఉపయోగాలెన్నో.

కదిరి: సాంకేతిక దూకుడు పెరిగిన నేటి రోజుల్లో దాదాపు అన్ని రంగాల్లో కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఏఐ) వినియోగం అనివార్యంగా మారింది. ఈ-కామర్స్ మొదలు సోషల్ మీడియా వరకూ అన్ని రంగాలు ఏఐని ఉపయోగిస్తున్నాయి. ఇప్పటికే పలు దిగ్గజ సంస్థలు ఏఐ సేవలను అందుబాటులోకి తీసుకురాగా. తాజాగా ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా సైతం అదే దూకుడును ప్రదర్శిస్తోంది. ఎక్కువ మంది ఉపయోగిస్తున్న మెసేజింగ్ యాప్ 'వాట్సాప్' తాజాగా ఏఐ రంగంలోకి కూడా అడుగు పెట్టింది. ప్రస్తుతం ఏఐ టెక్నాలజీకి పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో 'మెటా' కూడా ఆ దిశగా అడుగులు వేసింది. ఇందులో భాగంగా 'మెటా ఏఐ' పేరుతో కొత్త ఫీచర్‌ను పరిచయం చేసింది. వారం రోజులుగా ఇప్పుడు వాట్సాప్ ఓపెన్ చేయగానే చాలా మంది



వాట్సప్‌లో మెటా ఏఐ సింబల్

స్మార్ట్ ఫోన్లలో రౌండ్‌షేప్‌లో ఓ సింబల్ కన్పిస్తోంది. అదే మెటా ఏఐ!

క్షణాల్లోనే కోరిన సమాచారం

మెటా తీసుకొచ్చిన ఈ కొత్త ఫీచర్ అచ్చం చాట్ జీపీటీలా పని చేస్తుంది. వాట్సాప్ ఓపెన్ చేయగానే మీ సెల్‌ఫోన్‌లో కన్పించే రౌండ్ సింబల్‌ను క్లిక్ చేసిన తర్వాత టర్మ్స్ అండ్ కండీషన్స్ యాక్సెప్ట్ చేయగానే 'మెటా ఏఐ విత్ లామా' అనే చాటింగ్ పేజీ ఓపెన్ అవుతుంది. మీ ఫ్రెండ్ లేదా ఇంకెవరితోనైనా ఎలాగైతే చాట్ చేస్తామో అలాగే మెటా ఏఐ ద్వారా కూడా చాట్ చేయచ్చు. మీకు ఏ సమాచారం కావాలన్నా అందులో టైప్ చేసి సెండ్ చేయగానే క్షణాల వ్యవధిలోనే మీరు కోరిన సమాచారం లభిస్తుంది. ఉదాహరణకు అనంతపురంలో లేదా కదిరిలో మీకు బెస్ట్ లాడ్జి ఏది? అని అడిగితే వెంటనే అందుకు సంబంధించిన లిస్ట్ ప్రత్యక్షమవుతుంది. తిరుమలలో అద్దె గది పొందడం ఎలా అని అడిగితే సమాచారం వస్తుంది. అలాగే మీకు ఇంకేదైనా ఫొటో కావాలన్నా క్షణాల్లో అందిస్తుంది. తాజాగా రిలీజ్ అయినా సినిమా వివరాలు కావాలన్నా తెలుసుకోవచ్చు. 'ఇమాజిన్ కార్ రేస్ ఆన్ మార్స్' అని టైప్ చేసినా కూడా వెంటనే మార్స్‌పై నిజంగా కార్ రేస్ జరిగితే ఎలా ఉంటుందో ఆ ఫొటో మీకు అందిస్తుంది. విద్య మొదలు వైద్యం వరకూ, టెక్నాలజీ నుంచి సైన్స్ వరకూ ఇలా అన్ని రకాల ప్రశ్నలకు మెటా ఏఐ మనకు సమాధానాలిస్తుంది. ఇండియా ప్రస్తుత ప్రధాని ఎవరు? అలాగే ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి ఎవరు? అనే ప్రశ్నలు అడిగినా తాజా సమాచారం మనకు ×మెటా ఏఐ℥ అందిస్తుంది. అయితే ప్రస్తుతం ఇంగ్లిష్‌లో మాత్రమే సమాచారం ఇస్తోంది. రానున్న రోజుల్లో మాతృభాషలో కూడా అందిస్తారేమో చూడాలి.

మెటా ఏఐని అడుగు



ఇన్నాళ్లూ ఏదైనా సమాచారం కావాలంటే గూగుల్‌లో సెర్చ్ చేసేవాళ్లం. కానీ ఇప్పుడు వాట్సాప్‌లో వచ్చిన కొత్త ఫీచర్ మెటా ఏఐని అడుగు అంటున్నారు. అన్ని రంగాల వారికీ ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది. మెటా ఏఐ అనేది ఉచిత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అసిస్టెంట్. మీరు ఎలాంటి ప్రశ్న అడిగినా మెటా సమాధానం ఇస్తుంది. కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు మనకు ఏ సమాచారం కావాలన్నా దీని ద్వారా తెలుసుకోవచ్చు. ఈ సౌలభ్యాన్ని అందుబాటులోకి తెచ్చిన మెటా సీఈఓ మార్క్ జుకెర్ బర్గ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పాల్సిందే. –డాక్టర్ మదన్‌కుమార్, కదిరి

ఏఐకి ఉజ్వల భవిష్యత్



తాజాగా వాట్సాప్ ద్వారా వచ్చిన కొత్త ఫీచర్ మెటా ఏఐని నేను ఉపయోగిస్తున్నా. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఏ సమాచారం కావాలన్నా క్షణాల్లో అందిస్తోంది. ఏఐకి మంచి ఉజ్వల భవిష్యత్ ఉంది. ఇంకా కొందరి ఫోన్లలో ఈ ఫీచర్ కన్పించడం లేదని విన్నాను. అలాంటి వారు వాట్సాప్ అప్‌డేట్ చేసుకోవడం ద్వారా మెటా ఏఐని పొందవచ్చు. అవసరం లేని వారు దీనిని డిలెట్ కూడా చేసుకోవచ్చు. – ఎల్.రాజీవ్‌రెడ్డి, న్యాయవాది, అనంతపురం

తలుపుల గంగాధర్ ఆగడాలకు అడ్డుకట్ట వేయండి

- ఎస్పీకి కదిరి న్యాయవాదుల సంఘం సభ్యుల ఫిర్యాదు


ఎస్పీ మాధవరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కదిరి న్యాయవాదులు

పుట్టపర్తి టౌన్: కదిరికి చెందిన బీజేపీ నాయకుడు తలుపుల గంగాధర్ దౌర్జన్యాలు, కబ్జాలకు అంతు లేకుండా పోతోందని, వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని కదిరి న్యాయవాదులు సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్పీ మాధవరెడ్డిని సోమవారం స్పందన కార్యక్రమంలో వారు కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. గత నెల 28న ఓ కేసుకు సంబంధించి కోర్టులో హియరింగ్ జరుగుతున్న సమయంలో న్యాయస్థానానికి వెళుతున్న న్యాయవాది, అసోసియేషన్ సభ్యుడు రామస్వామి నాయుడిపై తన కుమారుడు అనుచరులతో కలసి తలుపుల గంగాధర్ దాడి చేశాడని గుర్తు చేశారు. అక్కడితో ఆగకుండా హిజ్రాలను పిలుచుకు వచ్చి కార్యాలయంలో ఉన్న రామస్వామి నాయుడుకు పూలమాల వేయించి అవమానించారన్నారు. అప్పట్లో ఈ విషయంపై కదిరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు కూడా నమోదైందన్నారు. గంగాధర్ ఆగడాలు నిరసిస్తూ మూడు రోజుల పాటు కోర్టు విధులను న్యాయవాదులు బహిష్కరించారని గుర్తు చేశారు. గంగాధర్‌పై ఇప్పటికే పలు క్రిమినల్ కేసులు, ఆయన కుమారుడుపై కూడా హత్యాయత్నం కేసులు ఉన్నాయన్నారు. తాను రైల్వే పీఎస్సీ సభ్యుడిగా చెప్పుకుంటూ కారుకు మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్ బోర్డు పెట్టుకుని నిబంధనలకు విరుద్ధంగా భారత ప్రభుత్వ ఎంబ్లమ్, సైరన్ వేసుకుని తిరుగాడే గంగాధర్... ఎక్కడ లిటిగేషన్ భూములు ఉంటే అక్కడ సెటిల్‌మెంట్లు చేస్తూ రూ.కోట్లకు పడగలెత్తాడని ఆరోపించారు. యథేచ్ఛగా భూకబ్జాలకు పాల్పడుతున్నాడన్నారు. ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో టెంకాయల వ్యాపారం ముసుగులో గంజాయి విక్రయాలు సాగిస్తున్నాడని, ఎవరైనా అడ్డుకుంటే గొడవలు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయిస్తానని బెదిరిస్తున్నాడని మండిపడ్డారు. గంగాధర్ దౌర్జన్యాలు, దాడులు, కబ్జాలు, అసాంఘిక కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ మాధవరెడ్డిని కోరారు.

దానిమ్మకు తెగులు


దానిమ్మ పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్(ఇన్‌సెట్‌లో) దానిమ్మను ఆశించిన తెగులు

- సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు
- కళ్యాణదుర్గం కేవీకే శాస్త్రవేత్తలు

కళ్యాణదుర్గం: ప్రస్తుతం దానిమ్మ పంటకు బాక్టీరియా ఆకుమచ్చ తెగులు సోకిందని, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే తెగుళ్ల నివారణతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చునని కళ్యాణదుర్గం కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ రాధాకుమారి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 14,843 ఎకరాల్లో దానిమ్మ సాగులో ఉందన్నారు. దానిమ్మలో ఆకుమచ్చ తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వారు వివరించారు.

రోగ రహిత మొక్కనే ఎంచుకోవాలి

- కొత్తగా దానిమ్మ తోటలు సాగు చేయదలిచిన రైతులు రోగ రహిత మొక్కలను ఎంచుకోవాలి. మొక్కలను 4/4 మీటర్లు దూరంలో నాటుకుంటే తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుంది. తెగుళ్లు ఆశించిన కొమ్మల భాగాలను అంగుళం కింద వరకూ కత్తిరించి కాల్చివేయాలి. కత్తిరింపు సమయంలో వాడే కత్తెర్లను 1 శాతం సోడియం హైపోక్లోరేట్ లేదా డెటాల్ లేదా స్పిరిట్‌లో ముంచాలి.
- కత్తిరింపులు పూర్తయిన వెంటనే 1 శాతం బోర్డో మిశ్రమం పిచికారీ చేయాలి. నేలపై రాలిన ఆకులు, తెగుళ్లు సోకిన కొమ్మలు, కాయలను తీసి కాల్చివేయాలి. చెట్ల పాదుల్లో బ్లీచింగ్ పౌడర్ ఎకరాకు 8-10 కిలోలు చల్లడం వల్ల రాలిన ఆకులలో ఉన్న బాక్టీరియా నశిస్తుంది. కత్తిరింపులు తర్వాత వచ్చిన చిగుర్లపై రోగ లక్షణాలు కనిపించిన వెంటనే పది లీటర్ల నీటిలో కాపర్ ఆక్సిక్లోరైడ్ 2 గ్రాములు మరియు స్ట్రెప్టోసైక్లిన్ లేదా పోషోమైసిన్ 5 గ్రాములు కలిపి పదిరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పూత సమయంలో కాపర్ ఆక్సీ క్లోరైడ్ బదులుగా లీటరు నీటికి కార్బొండిజ్ 1 గ్రాము కలిపి పిచికారీ చేయాలి.
- పంట తర్వాత విశ్రాంతి సమయంలో కూడా మొక్కలపై 1 శాతం బోర్డో మిశ్రమం పిచికారీ చేయాలి. దీని వల్ల తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది. మొక్క రోగ నిరోధక శక్తిని పెంచేందుకు సిఫార్సు చేసిన రసాయన ఎరువులతో పాటు పశువుల ఎరువులు, జీవన ఎరువులైన అసోస్పైరిల్లమ్, ఫాస్ఫరస్, పొటాష్, జీవ శిలీంద్రనాశకాలైన ట్రైకోడెర్మా, సూడో మోనాస్‌లు కలిపి వేసుకోవాలి. దీనికి తోడు లీటరు నీటికి సూక్ష్మపోషకాలైన జింక్ సల్ఫేట్ 2 గ్రాములు, ఫెర్రస్ సల్ఫేట్ 2 గ్రాము, మెగ్నీషియం సల్ఫేట్ 2 గ్రాములు, బోరిక్ యాసిడ్ 1 గ్రాము చెట్లపై పిచికారీ చేయాలి.

బదిలీలకు నోచుకోని ఆర్టీఏ కానిస్టేబుళ్లు


రవాణాశాఖ కార్యాలయం

అనంతపురం సెంట్రల్: రవాణాశాఖలో కొన్ని నెలలుగా కానిస్టేబుళ్ల బదిలీలు చేపట్టకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ప్రతి మూడు నెలలకోసారి కానిస్టేబుళ్లకు బదిలీలు కల్పించాలనే నిబంధన ఉంది. అవినీతి, అక్రమాలను అరికట్టడంతో పాటు పారదర్శకమైన పాలన అందించేలా అనేక సంవత్సరాలుగా ఈ నిబంధన కొనసాగుతూ వస్తోంది. జిల్లాలో అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం రవాణాశాఖ కార్యాలయాలున్నాయి. రవాణాశాఖ అధికారులకు సబార్డినేట్‌గా ఒక్కో అధికారికి ఒకరు చొప్పున కానిస్టేబుళ్లను నియమిస్తుంటారు. అయితే రవాణా శాఖలో కానిస్టేబుళ్ల కొరత ఉండడంతో పోలీసుశాఖ నుంచి హోంగార్డులను డిప్యుటేషన్‌పై తీసుకున్నారు. ఉప రవాణా కమిషనర్‌గా వీర్రాజు నియమితులైన తొలి నాళ్లలో రవాణాశాఖ మొత్తం గాడిన పడుతుందని అందరూ భావించారు. పాలన సాఫీగా కొనసాగించడంపైనే దృష్టి పెట్టిన ఆయన అంతర్గత ప్రక్షాళనను పట్టించుకున్నట్లు లేదు. దీంతో అనేక నెలలుగా బదిలీలు లేకపోవడంతో యథాస్థానంలోనే కానిస్టేబుళ్లు కొనసాగుతున్నారు. ఈ విషయంపై డీటీసీ వీర్రాజును వివరణ కోరగా... కానిస్టేబుళ్ల బదిలీలపై కసరత్తు చేస్తున్నామని, త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రోహిల్ కుమార్


డాక్టర్ రోహిల్ కుమార్

హిందూపురం టౌన్: స్థానిక జిల్లా ఆస్పత్రి నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ రోహిల్ కుమార్‌ను నియమిస్తూ అనంతపురం డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో డాక్టర్ లింగన్న స్థానంలో సూపరింటెండెంట్‌గా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన చికిత్సలు అందజేస్తామని భరోసానిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధరను మర్యాదపూర్వకంగా కలిసారు.

రైతు సంఘాలకు కుచ్చుటోపీ... నిందితుడి అరెస్ట్

- ఎఫ్‌పీఓగా పరిచయం చేసుకున్న యువకుడు
- లీజుకు తీసుకున్న వేరుశనగ నూర్పిడి యంత్రాల విక్రయానికి సిద్ధం
- రూ.70 లక్షల విలువైన యంత్రాల స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాజీజాన్ సైదా

గుడిబండ: వేరుశనగ నూర్పిడి యంత్రాలను లీజుకు తీసుకుని తిరిగి ఇవ్వకుండా అమ్ముకున్న వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఎస్‌కె బాజీజాన్ సైదా తెలిపారు. వివరాలను సోమవారం ఎస్ఐ మునిప్రతాప్‌తో కలసి ఆయన విలేకరులకు వెల్లడించారు. రొళ్ల మండలానికి చెందిన సి.తిమ్మరాజు ఆరు నెలలుగా ఎఫ్‌పీఓగా (ఫార్మర్ ప్రొడ్యూజర్ ఆర్గనైజర్) చెలామణి అవుతూ అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లోని రైతు సంఘాల సభ్యులతో పరిచయం పెంచుకున్నాడు. అనంతరం వారికి కొంత డబ్బు అడ్వాన్సుగా ఇచ్చి నకిలీ చిరునామాపై వేర్వేరుగా 14 వేరుశనగ నూర్పిడి యంత్రాలను లీజుకు తీసుకున్నాడు. ఈ క్రమంలో అద్దె కూడా చెల్లించకుండా ముఖం చాటేసి, వాటిని విక్రయించేందుకు బేరం మాట్లాడుకున్నాడు. ఈ నేపథ్యంలో తిమ్మరాజు ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు హిరేతుర్పిలో అదుపులో తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో వాస్తవాలు బహిర్గతం అయ్యాయి. రూ.70 లక్షల విలువైన నూర్పిడి యంత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. తగిన ఆధారాలు చూపి యంత్రాలను తీసుకెళ్లాలని ఆయా రైతు సంఘాల సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు.


రూ.3.50 లక్షల నగదు అపహరణ

రాయదుర్గం టౌన్: తాళం వేసిన ఇంట్లోకి చొరబడి రూ.3.50 లక్షల నగదు అపహరించుకెళ్లిన ఘటన రాయదుర్గంలో చోటు చేసుకుంది. వివరాలు... పట్టణంలోని జేఆర్ఎస్ కాలనీలో నివాసముంటున్న హుస్సేన్... ఇటుకల బట్టీ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఓ ఇంటిని విక్రయించగా వచ్చిన డబ్బును వంటగదిలోని ఓ డబ్బాలో ఉంచాడు. ఆదివారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి పై అంతస్తులో నిద్రపోయాడు. విషయాన్ని గమనించిన దుండగులు ఇంటి తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి వంట గదిలోని డబ్బాలో ఉంచిన రూ.3.50 లక్షలు, బీరువాలోని గిల్టు నగలను అపహరించుకెళ్లారు. సోమవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన బాధితుడు హుస్సేన్ ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాసులు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారున.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

బుక్కరాయసముద్రం: నేరాలను నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా జైలు సూపరింటెండెంట్ రహమాన్ తెలిపారు. నేరాలకు సంబంధించిన కొత్త చట్టాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రెడ్డిపల్లిలోని జిల్లా జైలులో జైలు సిబ్బందికి, అధికారులకు సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ చట్టాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు మాట్లాడుతూ... కొత్త చట్టాలకు సంబంధించిన పలు అంశాలపై అనుమానాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడెడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ నల్లప్ప, లీగల్ ఎయిడెడ్ కౌన్సిల్ డిప్యూటీ చీఫ్ పెద్దన్న, అసిస్టెంట్ లీగల్ ఎయిడెడ్ కౌన్సిల్ అరుణ్‌చైతన్య, జైలర్లు వసంతకుమార్, నాగరాజు, అచ్చెన్నాయుడు, మధుసూదన్‌రెడ్డి, డిప్యూటీ జైలర్లు, న్యాయవాదులు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ అందకనే ఆగిన గుండె


మృతి చెందిన పూల వెంకటస్వామి

ఓడీచెరువు: మండలంలోని ఆకుతోటపల్లికి చెందిన పూల వెంకటస్వామి (80) అనే వృద్ధుడు పింఛన్ డబ్బు తీసుకోకుండానే కన్నుమూశాడు. సోమవారం గ్రామ సచివాలయ సిబ్బంది పింఛన్ ఇవ్వడానికి అతని ఇంటి వద్దకు వెళ్లారు. పలుమార్లు ప్రయతి్నంచినప్పటికీ ఫింగర్ ప్రింట్ అథెంటికేషన్ తీసుకోలేదు. ఐరిష్ పద్ధతిలో ఇవ్వాలని భావించారు. కానీ కళ్లు తెరవలేకపోవడంతో అది కూడా విఫలమైంది. ఇంతలోనే అతను తుదిశ్వాస వదిలాడు. చివరకు పింఛన్ డబ్బు ఇవ్వకుండానే సచివాలయ సిబ్బంది వెనుదిరిగారు.